మోహన రవళి - ఆది

పిల్లంగ్రోవి పట్టు మంటా - చెదరే చీని మా
గొల్లవారి పిల్లగ్రోవి - కోరోచల్లా

పాడుంటా దండెమీటె - బలుమారును దా
వేడుక నెవ్వెతె పాట - వినవచ్చెనో
వాడలో జల్లలమ్మే - వనిత నింతే శ్రుతి
గూడినే బాడేటి చల్ల - కోరోచల్లా

చేరి నన్నునాడు మంటా -చె క్కునొక్కీనీతా
గారవాన నెవ్వెతాట - గని వచ్చెనో
మారుకు మారాడేటి - మంద వారముమేము
కోరికినాడేటి చల్ల - కోరో చల్లా

కిన్నెర మీటుమంటా - గెలసీని నన్ను
కిన్నెర మీట్లనేది - గిలిగించెనో
కన్నుల కలికి వేం - కట పతిపై వెట్టి
గొన్న కిన్నెర గుబ్బల - కోరో చల్లా

గొల్లపడుచుల పెరుగు చల్లలమ్మేపాట ఈ 'కోరోచల్ల'పాట. 'కొనరో' అన్న పదంలో కొ ప్లస్ నా - కో అయి గొల్లెతల గ్రామ్యశైలిలో 'కోరోచల్ల' - 'కొనరోచల్ల'కు రూపంగా ఏర్పడినట్లుంది. నాచిన్నప్పుడు మా అమ్మమ్మగారు పాడే ఒక పాట - కర్తృత్వం తెలియదు - అందులో ఒక గోపిక పెరుగు అమ్ముదామని 'పెరుగో పెరుగో' అనబోయి, 'గోవింద దామోదర మాధవ' అని అరుస్తూ వీధులన్నీ తిరిగిందని మధురమైన ఊహ. తోడిరాగం లో అని జ్ఞాపకం, పాట పల్లవి అనుపల్లవి మాత్రం స్మృతిలో ఉన్నవి.

గోవింద దామోదరా - మాధవయని
గోపకన్య పెరు - గమ్మెనే
భావించి పెరుగో పెరుగో యనబోయి
బాలకృష్ణుని మీది మోహవశముచే ॥గోవింద

చిన్నికృష్ణుని బాల్యక్రీడను చిత్రించిన మనోజ్ఞమైన సంకీర్తనమిది. ఇందులో నాయిక ముగ్ధ గోపిక - బాలకృష్ణుని క్రీడలు వర్ణిస్తూ చల్లలమ్ముతోంది ఆమె. తన మురళిని పట్టుకొమ్మని బెదరిస్తున్నాడమ్మా మా యాదవకుల మురళి (చల్లమ్మా కొనండి పెరుగమ్మా కొనండి)

పాట పాడమని తంబుర మీటుతున్నాడే కొంటె కృష్ణయ్య, ఎవతె పాట అతని చెవులలో ఇంకా మర్మోగుతోందో గానీ, చల్ల పెరుగులమ్ముకునే దానను నేనేంపాడతాను. తంబురశ్రుతిలో పాడినా నాపాట చల్లపాటే: చల్లమ్మా చల్ల: పెరుగమ్మా పెరుగు!

నృత్యమాడు - చిందులువేయమని నా చెక్కిలి నొక్కుతున్నాడే చిలిపి గోవిందుడు. ఎవతె నృత్యం చూసివచ్చాడో యేమో గంతులు వేయమంటున్నాడు. మేం గొల్లవారం. మాటకు బదులు మాట మాత్రం ఆడగలం. ఈ ఆటలు గెంతులు మాకేమి తెలుసు. నాకు తెలిసిన ఆట అల్లా చల్లలమ్మే ఆటే చల్లమ్మా చల్ల: పెరుగమ్మా పెరుగు

కిన్నెర వాయించమని ఒత్తిడి చేస్తున్నాడు నన్ను, ఈ వేంకటపతికి అందమైన కన్నులు గల ఎవర్తె తన పలుద చన్ను గుబ్బలపై ఇతని చేత వెట్టి చాకిరీ చేయించుకుంటూ, కిన్నెర మీటుల్లాంటి చక్కిలిగింతలు పెట్టిందో యేమో! చల్లోయమ్మ చల్ల: పెరుగోయమ్మ పెరుగు, అంటూ ఈ 'కోరోచల్ల' పాటలో తన మనసులోని గుట్టంతా రచ్చకెక్కించు కున్నది పాపం ఆ మాయ తెలియని గొల్ల కన్నె, ఆగోపికా, తాను మధురభక్తి ముగ్ధ ప్రేమలలో బింబ ప్రతిబింబాలు గనుక సంకీర్తనాచార్యులు రమణీయమైన ఈ జానపద గీతాన్ని సరసమధురంగా సంతరించారు.